చిన్న నవల

# స్మృతిచిహ్నం



— జలంధర

“వేర్దమ్‌! అసలు మీకేం కావాలో మీకు తెలుసా?”

చటుక్కున ఎగ్జిక్యూటివ్ ఛైర్ రొటేట్ చేసింది జ్ఞాన.

ఎదురుగా ఉన్న గుమ్మానికానుకుని నిలబడి ఉన్నాడతను చేతులు కట్టుకుని....అతని భుజంమీద నుంచి ఒక కాన్వాస్ బాగ్ వేళ్ళాడుతోంది.... మనిషి చాలా సాధారణంగా ఉన్నాడు. అతని కళ్ళు... అవి చాలా తీక్షణంగా చూస్తున్నాయి. బహుశ అతని కుంచెలోనించి జారే రంగుల కాంతులను పక్కకు తప్పించి, వాటి వెనకాల వెలుతురుకు రూపకల్పన చెయ్యగలిగిన శక్తి అతని ఎక్కువే కళ్ళకు ఉండి ఉండాలి. అతను ఆర్టిస్ట్. పేరు ప్రత్యగాత్మ.

డబ్బుకు లొంగని వ్యక్తి. బహుశ అందుకే అందరికీ అందుబాటులో ఉండని వ్యక్తి. అది తెలిసే పిలిపించింది ఆమె అతణ్ణి.

జ్ఞాన తండ్రి పేరుమీద కట్టిస్తున్న అనాధ

శరణాలయం ముందు స్థాపించబోయే స్మృతి చిహ్నాన్ని డిజైన్ చెయ్యడానికి పిలిపించింది ఆమె అతణ్ణి.

అంతకు ముందు పదిమందిని డిజైన్ చెయ్యడానికి రప్పించింది. వారి ఊహలు ఆమె మనస్సుతో ఏకీభవించలేదు. పెదవి విరిచింది. ప్రత్యగాత్మను గురించి విన్నది. అతను ఎక్కడికీ తొందరగా రాడు, డబ్బుకు లొంగడు అన్న మాట విని పంతం పెరిగి పిలిపించింది.

ఒకటి రెండురోజులు అతను వేసిన పెన్సిల్ స్కెచెస్ చూసింది. అందరూ బావున్నాయి అన్నారు. ఆమెకీ నచ్చాయి కానీ అది కాదు ఆమెకు కావల్సింది.

మూడవరోజు పొద్దున్నే ఆమె ఆఫీస్ రూంకు వస్తూ సూటిగా ప్రశ్నించిన అతణ్ణి చూసి ఉలిక్కిపడింది ఆమె. ఏమిటితని ధైర్యం? పులిపిల్ల కళ్ళులా ఉన్న ఆమె కళ్ళల్లో ప్రశ్నకు–

అతను నవ్వుకున్నాడు. నలభై ఏళ్ళు నిండుతున్న అతని జీవితానుభవమేమీ సామాన్యమైనది కాదు. డబ్బుకు లొంగని వాడు. తను నమ్మిన విలువలకు ప్రాధాన్యత ఇచ్చేవాణ్ణి ప్రపంచం ఎలా శిక్షించి, నిలబెట్టి చిత్రహింస పెడుతుందో అతనికి తెలిసినంత బాగా ఎవరికీ తెలియదు. ఏ క్రమశిక్షణకూ లొంగని అతని జీవితం చాలా రకాలుగా సంఘంచేత ప్రశ్నించబడింది.

కేవలం చీరల ముడుతలతో వ్యక్తిలోని కరుణ, జాలీ, లాలస, లాంటివి రేఖలుగా సృష్టించగలిగిన అతని పెయింటింగ్స్‌కు విదేశాల్లో గుర్తింపు వచ్చింది, కానీ వాళ్ళ మన్ననలను అందుకోడానికి వెళ్ళాలంటే పాస్‌పోర్ట్‌కు డబ్బు లేని భయంకర ఆర్థిక న్యూనత అతనిది. ఆ తర్వాత చాలాసార్లు అనేక దేశాలు తిరిగాడు. అతనికి ప్రపంచమే ఒక పెద్ద కాన్వాస్ అనిపించేది.

అతను కేవలం రేఖలతో స్త్రీ నగ్నత్వంలోని సౌందర్యాన్ని మెరుపును. ఆవేశాన్ని. వెలుగు నీడల మధ్య విస్ఫుటమయ్యేటట్లు వేసిన పెయింటింగ్ అతనికి ప్రపంచ విఖ్యాతి నార్జించి పెట్టింది .. కానీ ''ఆః బట్టలు లేని బొమ్మలు....'' అని తిట్టిపోశారు. అతని చుట్టూ ప్రపంచం ...కనబడ్డ ప్రతి ఆడపిల్లా అతడు తనకు బట్టలు ఒలిచి ఊహిస్తున్నాడని భయపడ్డట్టు నటించి కొంగు ఒంటిచుట్టూ కప్పుకుని పాతివ్రత్యం నటిస్తూంటే అసహ్యమేసి, అతను మనుష్యులకు దూరంగా శిలలకు మధ్య ఒంటరిగా తన ప్రపంచం తాను సృష్టించుకుని బ్రతుకుతున్నాడు. అతను కావాలి, అని కోరుకున్న వారు ఏ కొద్దిమందో అతని దగ్గరకు వెళతారు.... కానీ వాళ్ళకు అక్కడ కనిపించేవి రంగులు, కుంచెలు, సహం మలిచిన రాళ్ళు, పనిముట్లు.... ఏమాత్రం క్రమశిక్షణ కనిపించని వాతావరణంలో రెల్లు గడ్డితో వేసిన కుటీరం, దాని గోడలకు, కిటికీలకు అతను వేసిన పెయింటింగ్సు బహుశ ప్రపంచపు కళాకారుల ఎగ్జిబిషన్‌లో విలువకట్ట లేనంతగా నిలబడిపోతాయేమో ... చుట్టూ పేరు తెలియని తీగలు అస్తవ్యస్తంగా పూచిన అందంగా వున్న పూవులు ... దూరంగా పారుతున్న ఏరు. ఒక లాగూతో శరీరం మీద ఏ ఆచ్ఛాదనా లేకుండా బవిరి గడ్డంతో ఏ మాత్రం తన పరిస్థితికి సిగ్గుపడకుండా సన్నటి చిరునవ్వుతో ఎదురు పడతాడు అతను. ఆ వంకర నవ్వుతో ప్రపంచం పట్ల వుండే మాకరీ చాలా కొద్ది మందికే అర్థమౌతుంది.

తెలివిగల అభిమానులైతే అతనికి తినడానికి ఏమైనా తీసుకు వెళ్ళాలని ఆలోచిస్తారు. ఎందుకంటే తిండీ నిద్రా అతని కనీస అవసరాల లిస్ట్‌లో వుండవు మరి.

అతని ఆలోచనలు, అతని నిర్లక్ష్యం, అతని చిన్ని ప్రపంచం, అతని మాటల్లో–కుంచుకుపోతూ, తనను తాను రక్షించుకోని ప్రపంచం పట్ల ఉన్న జాలి. ఇవన్నీ భరించగలిగిన వాళ్ళే అతణ్ణి చూడటానికి వెళ్ళాలి. లేకపోతే, ''గొప్పవాడే కానీ— పర్వర్ట్'' అని ఒక మాట అనేసి, తమను, తమ లోపలదాగి ఉన్న ఆత్మ చుట్టూ అల్లుకున్న గజిబిజి తెరలు చీల్చి చూస్తున్న అతని చూపు తట్టుకుని పారిపోయి తమ ప్రపంచంలోకి అడుగు పెట్టి ఒక గ్లాసుడు మంచినీళ్ళు గటగటా తాగిన సంఘంలో పెద్ద మనుష్యులు, గొప్పవాళ్ళు అనేక మంది వున్నారు.

''వాళ్ళ 'ఆరా' వాళ్ళను బైట పెడుతుంది. దాన్ని చూడగలిగిన వాడిని వాళ్ళు భరించలేరు. అంతే అదే నామీద కోపానికీ కారణం. అందుకే నేనే దూరంగా ఉన్నాను.'' అనే అతణ్ణి ఎవరూ పలకరించలేరు.

అటువంటి అతడు కోటీశ్వరులు ఎవరో కట్టే పాలరాతి గుళ్ళో అమ్మవారి విగ్రహాన్ని చెక్కడానికి ఒప్పుకున్నాడని విని అదిరి పోయారు చాలా మంది.

''భగవంతుడనే కాన్సెప్ట్ మనిషి సృష్టించుకున్నదే. దానికి తనలోని శక్తితో, ప్రాణ ప్రతిష్ఠ చేసే మనిషి మాగ్నటిజమే భగవత్శక్తి....'' అనే అతను ఈ పని ఎలా చేస్తాడా అని కుతూహలంగా అతణ్ణి పరిశీలించింది అతని చుట్టూ ప్రపంచం.

అతను సృష్టించిన అమ్మవార్ని చూసి ఉలిక్కిపడింది జ్ఞాని – కారణం....విగ్రహమంతా వింత కోణాలతో, డెప్త్‌తో సృష్టించాడతను. మామూలుగా మనం చూసే కాలండరు బొమ్మల్లో అమ్మవారి లాగానో, మన ఇంట్లో కళగల మనిషికి నగలు పెట్టి విగ్రహంలా తయారు చేసినట్లో లేదు. ఏదో శక్తి....ఒళ్ళు జలదరింపు....ఏదో తెలియని భావన. పేరు తెలియనిది, ఊహకు, శ్లోకానికి, రంగుకు, భావనకు, అందనిది–కలుగుతుంది.

ఏమిటో...చక్కగా అమ్మవారిలా లేదు....'' అనుకుంటూనే పదే పదే వెళ్ళేవారు జనం ఆ గుడికి. ఆ విగ్రహం వలననే ఒక మాన్యుమెంటుగా తయారు అయింది.

''సృష్టికి మూలమైన శ్రీ చక్రంలో ఏముంది?! కోణాలు, గీతలు ... అనాటమీ చదివి, మిస్టిక్ సైన్స్ చదివితే, మానవ శరీరం కూడా అంతేనని అర్థమౌతుంది. శరీరంలో ఉండే శక్తి, ఏకాగ్రత అనే మధన వలన కొన్ని బిందువుల వద్ద ప్రజ్వరిల్లుతుంది. అవన్నీ శరీరాంతర్గత చక్రాలు. కొన్ని పొరలు దాటితే కానీ అవేవీ కనిపించవు. ఫైనల్‌గా చూడగలిగే జ్ఞాన స్వరూపాన్ని నేను ఎక్సరైజ్ చేశాను. కానీ, ప్రారంభ దశలో ఉన్న వాడికి . ఏకాగ్రత కోసరం తనకు నచ్చిన రూపం రావాలి. అందుకే ప్రియురాల్ని ధ్యానిస్తూ, యోగులైపోయిన వారి కథలు వున్నాయి మరి.... అటువంటి వారికి మిగతా గుళ్ళు వున్నాయిగా. మీ మనస్సు సబ్‌కాన్షియస్ పొరల్లో స్పందించే కోరికలతో అలంకార ప్రియురాలైన అమ్మవారు, అభిషేక ప్రియురాలైన అమ్మవారిని కావాలని కోరుకుంటున్నారు. ఆ అభిషేకాలు, అలంకారాలు తాంత్రిక సిద్ధాంతాలమీద, ఆ విగ్రహాలకు శక్తి నివ్వడానికి ఏర్పడ్డ పద్ధతులు. మనలోని శక్తి ఉన్మీలనమైనప్పుడు దానికి స్థిరత్వం, రేడియేషన్ ఒక వస్తువును ఆపాదించగలిగిన

పద్ధతి తెలిసినప్పటి మాటర్ఎనర్జి అనే స్థితికి రాగలిగినప్పుడు ఆ డివైన్ మాగ్నటిజమే ఆ వస్తువు చుట్టూ రూపు దాలుస్తుంది. ఆ పద్ధతిలో చేశాను నేను ఆ విగ్రహాన్ని....''

ఇలా ఒక పత్రికలో అతని ఇంటర్వ్యూ చదివింది జ్ఞాన....మరొక జవాబు చదివి షాక్‌తిన్నంత పనైంది ఆమెకు.

శివలింగాన్ని ప్రతిష్ఠించాలనుకుంటే మీరేమిటి శక్తి స్వరూపాన్ని చెక్కారు?'' అన్న ప్రశ్నకు,

"శివశక్తి విభజేన జాయతే సృష్టి కల్పనా....

Shiva is the cognitive principle and shakti is its primordial principle though dual for the sake of argument, Can under no circumstances be seperated from one another just like a piece of paper having two sides అని తేల్చి పారేసేడు. అది చదివే ఆ గుడి చూడటానికి వెళ్ళింది జ్ఞాన. అతని మాటలు సంపూర్ణంగా అర్థమవక పోయినా నిజమేననిపించింది.

అతణ్ణి కలుసుకోవాలనుకున్నది, కానీ ధైర్యం చాలలేదు. అందుకే ముందు తను నిర్మించదలుచుకున్న స్మృతిచిహ్నానికి చాలామంది ఆర్టిస్ట్‌లను పిలిపించింది. ఆ తరవాతే, అతడెందుకు వస్తాడు? అంత మొండివాడు....గొప్పవాడు అనుకుంటూనే కబురు చేసింది ప్రత్యగాత్మకు.

కానీ, విచిత్రం వచ్చాడు. అతనిలాగే అతని నిర్ణయాలు కూడా విచిత్రమైనవి.

అతని కిచ్చిన ఏసీరూమూ, సౌకర్యాలు వదులుకుని, తోటలో చెట్టుకింద కూర్చుని అతను వేసిన స్కెచెస్ చూసింది ఆమె. చాలా బాగున్నాయి, కానీ; తనకు కావలసింది ఇది కాదు. ఇలా చెప్పడానికి ధైర్యం లేదామెకు. కానీ తనకు ఏం కావాలో ఎలా చెప్పాలో తెలియడం లేదామెకు.

ఎప్పుడో ఉన్నట్లుండి _ "నేను వెళ్ళొస్తాను. నీలాంటి మూర్ఖురాలు ప్రపంచంలో వుండబోదు.'' అని చెప్పి వెళ్ళిపోతాడేమోనని భయపడి పోతోందామె.

ఓ సుప్రభాతాన, ఆమె గదిలో అడుగు పెడుతూ అననే అన్నాడామాట అతను.

ఎంత వద్దనుకున్నా ఆమెలో పౌరుషం పడగెత్తనే ఎత్తింది.

"సారీ మీ స్కెచెస్ గొప్పగా ఉన్నాయి. కాదనను. నాకు కావలసినది నేను చెప్పలేకపోవచ్చు కానీ....'' తెలియకుండానే ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

మెల్లగా అతను అడుగులో అడుగు వేసుకుంటూ ఆమె టేబుల్ దగ్గరకు వచ్చి ఆగాడు. సూటిగా ఆమె కళ్ళల్లోకి చూశాడు. పాతికేళ్ళ అమ్మాయి, డబ్బు, అరిస్టోక్రసీ వున్న అమ్మాయి. తన మీద, తన స్టేటస్ మీద విపరీతమైన నమ్మకమున్న అమ్మాయి జ్ఞాన. కానీ అతని ఎక్స్‌రే చూపులకు తట్టుకోలేక గదంతా కలియచూసింది బిత్తరగా. చాలా గొప్పగా వున్నదాగది. నీలం రంగు కార్పెట్ ఇన్డోర్ ప్లాంట్సు గోల్డ్ ఫ్రేంలో దర్పం, అధికారం కనిపిస్తున్న ఫోటో. అక్కడ ఆగిపోయింది ఆమె చూపు. ఆమె చూపునే అనుసరిస్తున్న అతని దృష్టి కూడా అక్కడ ఆగింది. మెల్లిగా అడుగులో అడుగు వేసుకుంటూ ఆ ఫోటో దగ్గర నిలబడ్డాడు.

"ఈయన మీ నాన్నగారు కాదనుకుంటానే?'' విచిత్రంగా చూస్తూ అన్నాడతను.

గబగబా తలకాయ "కాదు _ కాదు'' అన్నట్లుగా చిన్నపిల్లలా ఊపేసింది జ్ఞాన. చెవినుండే రాళ్ళ జలకాలు తళ తళమన్నాయి.

"కరెక్ట్'' అన్నట్లుగా తల వంకించి మెత్తటి కుర్చీలోకి జారగిలబడి ఏమాత్రం మొహమాటం లేకుండా కాళ్ళు పైన పెట్టుకుని కూర్చున్నాడతను రిలాక్స్డ్‌గా.

"అప్పుడే అనుకున్నాను. మీ నాన్న ఫోటో వున్నదా?'' గబాల్న తన పర్స్‌నుంచి తీసి, ఒక్కసారి చూసి అతనికి ఇచ్చింది ఆమె. ఆమె ప్రవర్తనలో ఆర్తి అర్థమౌతోంది అతనికి.

ఆ ఫోటోను తదేకంగా చూస్తున్నాడతను. పేషెంటుకు క్లోరోఫాం ఇచ్చి ఆపరేషన్ చెయ్యబోయే ముందు చూస్తున్న సర్జెన్‌లా ఉన్నాడతను. ప్రాణ ప్రతిష్ఠ చేసే ముందు యంత్రాన్ని చూసే మంత్రద్రష్టలా చూస్తున్నాడు. ప్రాభాత కాంతిలో ఉన్మీలనమౌతున్న ఔషధులను పరిశీలిస్తూ ప్రాణశక్తి ప్రసాదిస్తున్న ఉదయభానుడిలా చూస్తున్నాడు.

సన్నగా, కోసుగా, ఆడపిల్ల కళ్ళలా పెద్దపెద్ద రెప్పలతో ఉన్న అతని కళ్ళు, ఆ చూపు చూసి ఆశ్చర్యపోయింది ఆమె_'నాన్న ఏమన్నా బ్రతికి మినియేచర్ స్థితిలో ఇతని చేతుల్లో ఉన్నాడా?' అన్నంత ఆశ్చర్యమేసింది.

"ఆ ఫ్రేంలో ఉన్న ఫొటో మా పెదనాన్నగారిది. నాన్న పోయిన తరవాత ఆయనే నన్ను పెంచి పెద్దచేసి ఈ ఆస్తి అవీ ఇచ్చారు. నన్ను ఎం. బి. ఏ చదివించారు'' అతణ్ణి డైవర్ట్ చెయ్యాలని కావాలనే అన్నదామాట.

సన్నగా నవ్వాడతను. ఆమె ప్రయత్నంలో దిలిపితనం అతనికి అర్థమైందేమో....

"మరి మీ నాన్న పేరు మీద ఎందుకు ఇదేదో కట్టిద్దామనుకుంటున్నారు?'' సూటిగా చూస్తూ అడిగాడు.

ఆ మాటల్లో కంపల్షన్.

"మా నాన్న....నాన్న నాకు గురువు, గైడ్, ఫిలాసఫర్, ఫ్రండ్ అన్నీ....''చాలా పొగరుగా తన స్టేటస్‌ను ప్రతిక్షణం గుర్తింపచెయ్యడానికి ప్రయత్నించే జ్ఞాన, దాదాపు కొన్ని వేలమంది పనిచేసే ఫ్యాక్టరీలకు మేనేజింగ్ డైరెక్టర్ అయిన జ్ఞాన ఒక్కసారిగా ఏడ్చేసింది. ఆ వాతావరణం అతని ప్రశ్న....అందులో ఏదో నిజం చెప్పమంటున్న బలవంతం....కంపల్షన్.

హాయిగా కుర్చీలో జారగిలబడి కూర్చుని ఆమె వంక చూస్తున్నాడతను. కుబుసం విడిచేసిన నాగకన్యలా ఉన్నది.

అతనికి నవ్వొచ్చింది. ఈ పిల్ల దుఃఖం, జీవితంలో అనుభవాలు, అనుబంధాలు జీర్ణించుకుపోయినట్లున్న ఆమె తండ్రి ఫోటో. ఇవి చాలు అతనిలోని కళాకారుడికి....నిజం చాలా సహజంగా అర్థమైపోతుంది కానీ దానికి ఊహాల పరదాలు, నటనల మర్మాలు అంటగట్టకుండా ఉంటే...ఇవన్నీ చీల్చి చూడగలడు కాబట్టే అతను ప్రత్యగాత్మ అయ్యాడు.

ఏడుస్తున్నదల్లా ఒక్కసారి తలెత్తి చూసింది ఆమె ఉలిక్కిపడి. నిశ్శబ్దమైన అతని నవ్వు ఆమెను అతని ముందు పసిబిడ్డలా...శిశువులా ఆర్తితో, ఆవేదనతో నిస్సహాయంగా నిలబడ్డ అప్పుడే పుట్టిన రక్తపుముద్దలా....అంతకన్న వెనక్కు గర్భస్థ శిశువుగా....మరింత వెనక్కు ఎదగని ఫొయిటస్‌లా...ఇంకా వెనక్కు.... వెనకకు అసలు ఆది అంతము, ఉనికి లేని ఒక చుక్క.... ఇలా అయిపోయి అతని ముందు అతని అరిచేతిలో

ఉండిపోయానన్న భావన వచ్చింది. ఉలిక్కిపడింది. ఒణికి తనను తాను కంట్రోల్ చేసుకున్నది.... ఆమె జ్ఞాన.... మామూలు ఆడపిల్ల కాదు.

"మీరలా నవ్వఖ్ఖర్లేదు మిస్టర్ ప్రత్యగాత్మా! మా నాన్నకూ నాకూ ఉండే అటాచ్‌మెంట్ మీకేం తెలుసు....హ్యూమన్ రిలేషన్‌షిప్స్‌కు వాల్యూ ఇవ్వని మీకు ఇది అర్థం కాదేమో....బట్...." హేంకీతో కళ్ళు అద్దుకుంటూ అదిరిపోతున్న పెదవులతో ఏదేదో హిస్టీరికల్‌గా మాట్లాడేస్తోంది జ్ఞాన.

"షటప్"....ఆ మాటకు ఉలిక్కిపడింది — ఆశ్చర్యంగా చూసింది....తనను అంత మాట....

"మీరు ఎంతో మంది ఆర్టిస్ట్‌లను రిజైన్ చెయ్యమని చెప్పి పంపించేశారని తెలిసింది. నేను మిమ్మల్ని, మీ సంపదను చూసి మీ దగ్గరకు రాలేదు. ఎగ్జిబిషన్ లాంటి ఈ ప్రపంచంలో తన దగ్గర వున్న 'ఆప్యాయత' అనే నోటుకు అమ్ముడుపోవడానికి ఏదీ సిద్ధంగా లేదని తెలిసిన అనాధ పాప కళ్ళల్లో ఆర్తి కనిపించింది మీలో నాకు మొదటి రోజు—ఎందుకు అని అడక్కండి అదంతే. ఈ రిచ్‌నెస్, ఈ ఫాల్స్ ప్రెస్టేజ్ ఈ గందరగోళాలన్నీ చీల్చి చూడగలను నేను, మీకేం కావాలో, మీచేతే రియలైజ్ చేయించాలని ఈ రెండు రోజులు ఓపిక పట్టాను. జీవితంలో ఏనాడూ ఎవరివల్లా నేను ఇంత ఓపిక చూపించలేదు. అందుకే...అందుకే 'నా' అనే అందరికీ దూరమయ్యాను నేను."

"మరి నా విషయంలో...." అరిచేత్తో చెంప మీద కారుతున్న కన్నీరు ఏ మాత్రం నాజూకుతనం లేకుండా, చిన్న పాపలా తుడిచేసుకుంటూ అడిగింది జ్ఞాన.

"మీలో అంతర్గతమైన ఆర్తి ఉన్నది జ్ఞానా... అది అనుభవించేవాడికే అర్థమౌతుంది. మిమ్మల్ని చూసి జాలి పడాలని మర్చిపోయి, భయపడి, గౌరవిస్తున్న ఈ మనుష్యుల్నందర్నీ చూస్తే జాలి వేస్తోందిముందు. సౌ కమాన్...ఈ అరిస్టోక్రసీలు, ఈ హావభావాలు, దాచుకునే నటనలూ, ప్రపంచం కోసరం మాట్లాడే మాటలు, చేసే చేతలు, చూసే చూపులు మర్చిపొండి. పసిపాపలా హాయిగా మీ నాన్న దగ్గర వుండే జ్ఞానలా మీ రెలా ఫీలవుతారో అసలు మీ నాన్న అంటే ఏమిటో నాకు చెప్పండి."

అతని గొంతులో పదును....శబ్దానికి అర్థం కల్పించే ఏదో తెలియని నిశ్శబ్ద స్మృతి....ఒకే స్థాయిలో మాటలో పదును కావాలన్నప్పుడు అరవకుండా, మాటను అదిమి శబ్దానికి అర్థం కల్పించే టెక్నిక్, హిప్నోటిక్‌ట్రాన్స్‌లా అనిపించింది జ్ఞానకు. గభాల్న కుర్చీలోనుంచి లేచి,

"మీకు తెలిసే ఉందంతా. నేను ఇంకా చెప్పాలా?" అన్నది. ఆ కంఠంలో కిందపడ్డా నాదే పైచెయ్యి అనే పసిపిల్ల తంతుకు నవ్వు వచ్చిందతనికి.

హాయిగా పకాలున నవ్వేశాడతను. 'అసలు ఇలా ఇతను నవ్వడం ఎవరైనా చూశారా?' అనుమాన మేసింది జ్ఞానకు.

"నాకు అర్థమవక కాదు మీచేత చెప్పించడం.ఇలా సర్వం మర్చిపోయి, నిజాయితీగా ఉన్నదున్నట్లు సమీక్ష చేసుకునే అవకాశం, ఆ భావస్థితి ఉన్నదే.... అది సర్వరోగనివారిణి....సర్వ సమస్యానివారిణి కూడా. కానీ, ఈ స్థితికి రావడానికి మనిషి ఒప్పుకోలేడు. అందుకే మీచేత చెప్పిస్తున్నాను.

"చాలా రోజులుగా మీలో దాగున్నదేమిటో బైటకు చెప్పగలగాలి. దానికి రంగులు పూయకుండా, మీ ఊహలతో రూపం మార్చెయ్యకుండా సబ్‌కాన్షియస్‌లో నిక్షిప్తమైన ఆలోచనలతో సంఘటనలనే రూపుమాపకుండా....చెప్పండి. ఇది మీకెంత మేలు చేస్తుందో చూద్దాం."

అప్పటికే ఆమె అతని మాటలు వింటూ వెళ్ళి అతని సోఫానానుకుని మోకాళ్ళమీద చేతులు పెట్టుకుని పసిపాపలా వింటోంది.

"మీరు నన్ను 'చిన్నారీ' అని పిలవకూడదూ మా నాన్నలాగా" అమాయకంగా అడిగింది.

ఆప్యాయంగా అతను ఆమె తలమీద చెయ్యి వేశాడు నవ్వుతూ.

"మన ఈ స్నేహానికి మళ్ళీ ఏదో పేరుపెట్టి తండ్రిలా, అన్నలా అనుకుంటూ వంచించుకోవద్దు. ఆ పేరుతో మీ నాన్న ఒక్కరే పిల్చే తృప్తి మీకుండనీయండి. మిమ్మల్ని ఈ రెండు రోజులుగా ట్యూన్ చేస్తే మీరు నా వేవ్‌లెన్త్‌లోకి ఇప్పుడు వచ్చారు. సే....వియార్ ఫ్రండ్స్. ఇంక చెప్పండి."

"ఏం చెప్పను?" ఏం చెప్పడానికైనా వెనుకాడని నిస్పృహాయత ఆమె గొంతులో ధ్వనించింది.

"మీ నాన్న అంటే మీకేమిటి?"

నీళ్ళు నిండిన కళ్ళతో తలెత్తి చూసింది జ్ఞాన.

నాన్నంటే....

(వచ్చే సంచికలో మరొక భాగం)

# వనిత మాటల కొలువు 119

సరైన సమాధానం:

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 ప | ■ | 2 రం | 3 గ | 4 ము | ■ | 5 ప్ర | 6 ప |
| ప | ■ | 7 భ | య | ము | ■ | 8 భా | వ్య |
| 9 అ | 10 త | ■ | ■ | 11 ద | 12 యి | త | ■ |
| ■ | 13 ప | థ | 14 ము | ■ | 15 రా | ము | 16 గ |
| ■ | స్వి | ■ | ద్రు | ■ | తు | ■ | డి |
| 17 మే | ■ | 18 వా | గు | 19 ర | ■ | 20 త్ర | యా |
| రు | ■ | స | 21 మ్మ | తి | ■ | ■ | ర |
| 22 వృ | గ | న | ■ | 23 భా | ర | త | ము |

ఈ సమాధానంతో సరిపోయే సమాధానం రాసిన వారు 20 మంది. వారు:

1. పి. ఆర్. సరోజినీదేవి, అనంతపురం 2. డి. శారద, పాల్వంచ 3. వి. సుబ్బలక్ష్మి, వరంగల్ 4. వి. సూర్యకుమారి, వరంగల్ 5. ఎమ్. రత్నమాల, వరంగల్ 6. ఎస్. సుమతి, భువనేశ్వర్ 7. డి. సావిత్రి, మన్నార్ పోలూరు 8. బి. కోమలి, విజయవాడ 9. పి. రంగమణి కొత్తగూడెం కలరీస్ 10. జి. వి. ఎల్. కవిత, గుంటూరు 11. టి. విజయలక్ష్మిబాయి, పామిడి 12. ఎస్. ఆర్. సౌభాగ్యలక్ష్మి, బెంగళూరు 13. ఎ. కమల, అనంతపురం 14. యు. పార్వతి, న్యూబొంబాయి 15. వి. ధర్మాంబ, విజయనగరం 16. ఎస్. ప్రేమకుమారి, హైద్రాబాదు 17. ఎల్. విజయలక్ష్మి, హైద్రాబాదు 18. సిహెచ్. రమాదేవి, విశాఖపట్నం 19. ఎ. ఉషారాణి, నందివెలుగు 20. విమలా శ్రీనివాస్, నైవేలి.

బహుమతి మొత్తం రూ. 200 లు వీరికి సమానంగా పంచి అందజేస్తున్నాము.